వీరభద్రీయ కులస్తుల సంక్షేమానికి కృషి



సావనీర్‌ను విడుదల చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్: తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మన్సూరాబాద్ ఎస్కే గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన వీరభద్రీయ (వీరముష్టి) సంఘం, కేంద్ర కమిటీ స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన హాజరై సిల్వర్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వీరభద్రీయ కులస్తుల డిమాండ్లు సమర్థనీయమని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటిని నెరవేర్చాలన్నారు. 2010లో వీరముష్టి కులస్తులకు అప్పటి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో 2 ఎకరాల స్థలం కేటాయించి, ఇప్పటికి పొజిషన్ చూపించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న వీరముష్టి కులస్తులకు రుణాలు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమంలో వీరముష్టి కులస్తులకు ప్రాధాన్యం ఉండేలా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ముసరాంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూధన్‌రెడ్డి, సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు కాటేపల్లి వీరస్వామి, నాయకులు రాజేశ్వర్‌రావు, పోచయ్య, కొండయ్య, జంగయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



హస్తినాపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటిస్తూ పోచమ్మగడ్డలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగస్వాములు అయితే త్వరితగతిన పూర్తవుతాయన్నారు. కార్పొరేటర్ వెంట నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రభుత్వంపై ఆరోపణలు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్.కె మహమ్మద్ అన్నారు. బుధవారం ఆర్‌కేపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖిల్లా మైసమ్మ దేవాలయంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని మరో కొత్త నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే ప్రజా ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో అనేక సార్లు ప్రోటోకాల్ ఉల్లంఘించిన సబితా ఇంద్రారెడ్డి ఇప్పుడు ప్రోటోకాల్ పాటించడం లేదని నిరసన తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో హైమద్, యూసుఫ్, మొయిన్, షోహెబ్ అక్బర్, గౌస్, రఫిక్ బాబా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వీధిదీపాల నిర్వహణను మెరుగుపర్చాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని వీధిదీపాల నిర్వహణను మెరుగుపర్చాలని టాస్క్‌కో అధికారులకు సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఆమె సైదాబాద్‌లోని ఎస్‌బీహెచ్-ఏ కాలనీ, లోకాయుక్త కాలనీ, ఏపీ ఏయూ కాలనీల్లో పర్యటించారు. తమ కాలనీల్లోని పార్కుల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగటం లేదని, పలుచోట్ల స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. కార్పొరేటర్ సూచనల మేరకు అధికారులు ఎస్‌బీహెచ్-ఏ కాలనీలో శిథిలమైన స్తంభాన్ని సిబ్బందితో తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కాలనీల్లోని పార్కుల్లో వెలగని దీపాలను మార్చాలని కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్‌లైట్స్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, విద్యుత్ లైన్‌మెన్ దినేష్, శరత్, వనజ, నీరజ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మొహర్రం



మన్సూరాబాద్ చౌరస్తా పీర్ల ఊరేగింపు



ఊరేగింపుగా వెళ్తున్న బీబీ కా ఆలం

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్, ఓల్డ్‌మలక్‌పేట్, అజంపుర, సరూర్‌నగర్‌లలో మొహర్రం ప్రశాంతంగా ముగిసింది. కులమతాలకతీతంగా పీర్లకు దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఊరేగింపుతో వస్తున్న పీర్లను కొందరు తమ ఇళ్ల వద్దకు ఆహ్వానించి పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ప్రధాన రహదారుల్లో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎల్‌బీనగర్ పరిధిలో..

మన్సూరాబాద్: త్యాగానికి ప్రతీకైన మొహర్రం ఊరేగింపు ఎల్‌బీనగర్‌జోన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగింది. మన్సూరాబాద్ చౌరస్తాలోని ఆషుర్‌ఖానా షైజాదే ఖాసీం పీర్ల కొట్టం నుంచి పీర్ల ఊరేగింపు కొనసాగింది. గత వారం రోజులుగా ముజావర్‌ఖాజా, సయ్యద్ పాషా, సయ్యద్ అన్వర్ నేతృత్వంలో సంతాప దినాలు పాటిస్తూ బుధవారం చివరిరోజు ఊరేగింపును నిర్వహించారు.

చాదర్‌ఘాట్‌లో..

చాదర్‌ఘాట్: అశ్వకదళాల మధ్య బీబీ కా ఆలం నిమజ్జనం చాదర్‌ఘాట్‌లో బుధవారం రాత్రి ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారికి ఒడిబియ్యం

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన బోనాల ఉత్సవాలలో మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అమ్మవారికి ఒడిబియ్యం పోశారు.

–హస్తినాపురం







గోవింద.. హరిగోవింద..

భక్తి ప్రపత్తులతో తొలి ఏకాదశి | భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



భక్తుల ఉపవాస దీక్షలు, భక్తి ప్రపత్తులతో తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎల్‌బీనగర్ మలక్‌పేట నియోజకవర్గాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, అక్బర్‌బాగ్, మాదన్నపేట తదితర ప్రాంతాలలో ఉదయం నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉపవాస దీక్షతో భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైష్ణవ దేవాలయాలతో పాటు శివాలయాలను వివిధ రకాల పువ్వులతో అందంగా అలంకరించారు. ఆయా ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు తగు ఏర్పాటు చేశారు.

–ఎల్‌బీనగర్/మలక్‌పేట జోన్ల బృందం



శ్రీఅష్టలక్ష్మి, నారాయణస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఆదిత్యానగర్‌కాలనీ: వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



వెండి మకర తోరణం ఆవిష్కరణ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమ్మమాట...అంగన్వాడీ బాట

- ఈనెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- కొత్త విద్యార్థుల చేరికలపై దృష్టి

చాదర్‌ఘాట్: ప్రాథమిక విద్యను మరింతా బలోపేతం చేసి చిన్నారులు, వారి తల్లిదండ్రులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమ్మమాట–అంగన్‌వాడీ బాట అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పకడ్బందీగా అమలు చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఐసీడీఎస్ మలక్‌పేట కిందకు వచ్చే మూసారాంబాగ్, సైదాబాద్, అజంపురా పరిధిలో 274 అంగన్‌వాడీ కేంద్రాలు, 17 మినీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 25,000 మంది చిన్నారులు చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా 3000 మంది విద్యార్థులు చేరారు. ఈ కార్యక్రమం ద్వారా మరింత మంది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు విడతలవారీగా శిక్షణ పూర్తి చేశారు.



చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు

ముఖ్య అతిథులుగా అమ్మమ్మ, తాతయ్యలు..

ఈ నెల 20వ తేదీ వరకు పిల్లలకు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన చదువును బోధిస్తారు. స్వయం సహాయక సంఘాలు, యువత, ఎన్‌జీఓలు, తల్లిదండ్రుల సహకారంతో ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 18న ఇంటింటికి తిరిగి రెండున్నర ఏళ్ల వయసున్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతారు. 19న కేంద్రాల్లో స్వచ్ఛత పాటిస్తారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు, మంచినీరు, మరుగుదొడ్డి, తదితర సౌకర్యాలపై దృష్టి పెడతారు. 20న సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తారు. తల్లిదండ్రులు, బంధువులు, అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి అవగాహన కల్పిస్తారు.



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

- మా పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించి టీచర్లను సన్నద్ధం చేశామని ఐసీడీఎస్ అధికారి జ్యోత్స్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమము విజయవంతం కావాలంటే తల్లిదండ్రు లు, బస్తీవాసుల సహకారం అవసరమన్నారు.

ప్రొటోకాల్ పాటించని చరిత్ర వారిదే

తుక్కుగూడ మున్సిపల్ ఛైర్మన్ మధుమోహన్

మహేశ్వరం: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి సబితారెడ్డి గెలుపొందిన ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి ఓడిన తమ నేతలను అధికారిక కార్యక్రమాల్లో వేదికలపై కూర్చోబెట్టారని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ ఆరోపించారు. బుధవారం తుక్కుగూడలో ఆయన బీజేపీ నాయకులతో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండి సబితారెడ్డి అధికారిక దుర్వినియోగానికి పాల్పడి ప్రతిపక్ష చైర్మన్, కౌన్సిలర్లపై అక్రమ కేసులు పెట్టించి వేధించారన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు, అరెస్టులు చేసిన విషయాన్ని మరిచిపోయారా విమర్శించారు. గతంలో రావిర్యాలలో కుల సంఘాల భవనాలకు శంకుస్థాపనలో తనను బీఆర్ఎస్ గుండాల చేత వేదికపై నుంచి గెంటేసి, ఓడిన నేతలను వేదికపై కూర్చోబెట్టుకొని తనపై అట్రాసిటీ కేసు నమోదు చేయించారని ఆరోపించారు. అప్పట్లో ఎన్నోసార్లు ప్రొటోకాల్ పాటించకుండా మమ్మల్ని అవమానపరిచి, ఇప్పుడు మీకు ప్రొటోకాల్ లేదని గగ్గోలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు శివకుమార్‌గౌడ్, యాదగిరిరెడ్డి, బీజేపీ నాయకులు సుధాకర్, శివయ్యగౌడ్ పాల్గొన్నారు.

'సబితారెడ్డిని విమర్శించడం సరికాదు'

కందుకూరు: కాంగ్రెస్ నాయకులకు సబితారెడ్డిని విమర్శించే హక్కు లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన అని చెప్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనే సీనియర్ మహిళా నాయకురాలు, ఎమ్మెల్యేగా ఉన్న సబితారెడ్డిని బోనాల చెక్కుల పంపిణీలో అవమానించడం సిగ్గుచేటన్నారు. ఏ హోదా ఉందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిని ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు కూడా స్థానికంగా అందరిని ప్రొటోకాల్ ప్రకారం ఆమె కలుపుకుని పోయారని గుర్తుచేశారు. ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ నాయకులనే నేరుగా నామినేట్ చేసుకోవాలన్నారు. నిన్న, మొన్నటివరకు సబితారెడ్డి వెనక ఉన్న నాయకులే పార్టీ మారి ఆమెను విమర్శించడం బాధాకరమన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని జోస్యం చెప్పారు.



రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 65, వంకాయ రూ. 28, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 38, బీర రూ. 23, క్యాబేజి రూ. 35, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 35, దొండ రూ. 30, చిక్కుడు రూ. 85, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 23, క్యాప్సికం రూ. 60, ఆలు రూ. 38, దోస రూ. 20, సొర రూ. 9, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

10న విద్యార్థి పోరుగర్జన

నాగోలు: దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న నగరంలో నిర్వహించనున్న విద్యార్థి పోరుగర్జన సభ విజయవంతం చేయాలని హైదరాబాద్ అధ్యక్షులు కిరణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన తేదీలను వాయిదా వేసి ఆగస్టు 10న విద్యార్థి పోరు గర్జన జరుగుతుందన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మన్సూరాబాద్: ఏకలవ్యుడి జయంతి వేడుకలు మన్సూరాబద్‌లోని ఏకలవ్య కాలనీనగర్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకలవ్యుడి వారసులు ఎరుకల కులాల సంక్షేమానికి రూ.500 కోట్లు నిధులను బడ్జెట్‌లో కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు వనం గంగయ్య, శేఖర్, రమేష్‌నాయక్, చర్ల రమేష్, స్వామి, చిన్ననర్సింహా, అనిత, భారతమ్మ, సమ్మయ్య పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు



పనులను పరిశీలిస్తున్న మధుసూధన్‌రెడ్డి

చంపాపేట: అభివృద్ధి పనుల్లో పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని మాధవనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను సర్కిల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కర్మన్‌ఘాట్ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దశరథగౌడ్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు హన్మంతరెడ్డి, మణిపాల్‌రెడ్డి, అనసూయ, శంభుప్రసాద్, మోహన్‌రెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.

దర్శకుడు పూరి జగన్నాథ్‌పై డీసీపీకి ఫిర్యాదు

నాగోలు: సినిమా డైరెక్టర్ పూరి జగన్నాథ్ తీసిన డబుల్ ఇస్మార్ట్ సినిమాలోని ఓ ఐటమ్ సాంగ్‌లో కేసీఆర్ వాడే పదాలను హుక్ లైన్‌గా పెట్టి యావత్ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బ తీసేలా చేశారని బీఆర్ఎస్ నాయకులు రజిత రెడ్డి, గర్రెపల్లి సతీష్ బుధవారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ పాటలోని పదాలను వెంటనే తొలగించాలని లేని పక్షంలో పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రహదారులు ఛిద్రం.. అధికారుల మౌనం!



పనులు పూర్తయిన తర్వాత మరమ్మతులు చేయకుండా వదిలేసిన దృశ్యం

- అభివృద్ధి పేరుతో రోడ్ల తవ్వకాలు
- రాకపోకలకు ఇబ్బందులు

చైతన్యపురి: అభివృద్ధి పేరుతో కాలనీలలోని రహదారులను ఇష్టానుసారంగా తవ్వి పనుల అనంతరం మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చైతన్యపురి డివిజన్‌లోని న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీ, విద్యుత్‌నగర్ ప్రాంతాల్లో ఏడాది క్రితం తాగునీటి పైపులు వేసేందుకు రహదారులను తవ్వారు. పైపులు వేసి తాత్కాలికంగా గుంతలలో మట్టి నింపారు. ఈ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మొర పెట్టుకున్నా ఏ మాత్రం స్పందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే..నీటి పైపులకు ఇళ్ల కనెక్షన్‌లు ఇవ్వటం పూర్తయితే రహదారులకు మరమ్మతులు చేయడానికి వీలవుతుందని అధికారులు చెబుతూ వస్తున్నారు. పాత లైన్ కనెక్షన్‌లను కొత్త వాటర్‌లైన్లకు కలపటంలో మెట్రోవాటర్ వర్క్స్ అధికారులు పట్టించుకోకపోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొత్త లైన్లు వేసినా ప్రయోజనం శూన్యం..

అందరికీ నీరు సరిపోకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా, పెరిగిన జనాభాకు అనుగుణంగా సరఫరా కాకపోవటంతో కొత్త లైన్లు వేశారని అయినా కనెక్షన్‌లు ఇవ్వక పోవటంతో నీటి సమస్య అలాగే ఉండగా కొత్తగా రహదారులు ఛిద్రం అయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అభివృద్ధి పేరుతో రహదారులు తవ్వటం తప్ప ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్పందించి ఇళ్లకు కొత్త కనెక్షన్‌లు ఇచ్చి రహదారులకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఏడాదిగా ఇబ్బందులు..



కొత్త వాటర్ లైన్ వేసేందుకు ఏడాది క్రితం రోడ్డు తవ్వారు. పైపులైను పనులు పూర్తి చేసినా కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. రోడ్ల గుంతలు పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే సమస్యపై గతంలో ఒక సారి ఎమ్మెల్యేను కలిసి విన్నవించాం, ఎన్నికలు రావటంతో ఎవరూ పట్టించుకోలేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రాజేశ్వర్, న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీ, అధ్యక్షుడు

సమస్య పరిష్కారానికి కృషిచేస్తా



తాగునీటి పైపులు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన వాస్తవమే. ఇంటింటికి కనెక్షన్ ఇవాల్సి ఉండగా వరసగా ఎన్నికలు రావటం అధికారులు బిజీగా ఉండటంతో కొంత ఆలస్యమైంది. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు వాటర్‌వర్క్స్ డీజీఎం శ్రీనివాస్‌తో మాట్లాడటం జరిగింది. నీటి కనెక్షన్‌లు ఇచ్చి రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.

–రంగా నర్సింహగుప్తా, చైతన్యపురి కార్పొరేటర్